ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పార్క్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 94 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
గురువారం 07 నవంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

# అలాంటి వారిని వదిలిపెట్టాలా?: సోషల్ మీడియా పోస్టులపై సీఎం చంద్రబాబు ఫైర్

ఆడబిడ్డలను కించపరిచేలా సోషల్ మీడియాలో ఇష్టానుసారం పోస్టుల పెడితే కఠిన చర్యలు తప్పవని ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరించారు.



అమరావతి, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్): ఆడబిడ్డలను కించపరిచేలా సోషల్ మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరించారు. దీనికోసం అవసరమైన చట్టాలు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజధాని పరిధిలోని తాళ్లాయపాలెంలో గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్ స్టేషన్ (జీఐఎస్)ను ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. పాత ప్రభుత్వం దుర్మార్గంతో విద్యుత్ ఛార్జీలు కొంతవరకు పెంచాల్సి వచ్చిందన్నారు. అది తాను తీసుకొచ్చింది. కాదని చెప్పారు. ఛార్జీలు పెంచకుండా ఉండే బాధ్యత తనదని స్పష్టం చేశారు. చరిత్రలో గుర్తుండిపోయేలా అమరావతి ఉద్యమం చేశారని చంద్రబాబు కొనియాడారు. ప్రపంచంలోనే మేటి నగరంగా అమరావతి అభివృద్ధి చెందుతుందన్నారు. అధికారం పోయాక వైకాపా నేతలు అభివృద్ధికి ఆటంకం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని.. మానసికంగా దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతో పాటు డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్, మంత్రి అనిత, ఎమ్మెల్యేలపై అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ బిడ్డలపైనా ఇష్టారీతిన పోస్టులు పెట్టారని.. అలాంటి వారిని వదిలిపెట్టాలా? అని ప్రశ్నించారు. బాంబులకు కూడా భయపడలేదని.. కానీ తన గురించి అసెంబ్లీలో దుర్మార్గంగా మాట్లాడినప్పుడు కన్నీళ్లు పెట్టుకున్నానని చెప్పారు. కొవ్వు ఎక్కువై నేరస్థులుగా తయారవుతున్నారని తీవ్ర స్వరంతో సీఎం వ్యాఖ్యానించారు. ఆ కొవ్వును కరిగిస్తామన్నారు."నేరస్థులు రాజకీయ ముసుగులో ఉన్నారు.. ఘోరాలు చేస్తున్నారు. ఆస్తులు కొట్టేస్తున్నారు. అదే సమయంలో ప్రశ్నిస్తే ప్రజాస్వామ్యం అంటున్నారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని సాక్షిలో ప్రసారం చేశారు. నేనూ నమ్మాను. ఆ తర్వాత అది భయంకరమైన హత్య అని తేలింది. కరుడుగట్టిన నేరస్థుడు ఎలాంటి పనులు చేస్తాడో గుర్తుపెట్టుకోవాలి. దేశం, ప్రపంచంలో ఉండే చట్టాలన్నీ అధ్యయనం చేస్తా. ఆడబిడ్డలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే ఖబడ్దార్. హద్దులు దాటితే ఉపేక్షించేది లేదు. చేతగానితనం అనుకోవద్దు. మీరు మనుషులేనా? మీకూ, మృగాలకు తేడా ఏంటి? భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అంటే ఆడబిడ్డల వ్యక్తిత్వాన్ని హననం చేయడమా? అసభ్య, అశ్లీల పోస్టులు పెట్టడమా? ఏ చట్టం మీకు ఈ హక్కు ఇచ్చింది? దీనిపై సీరియస్గా ఆలోచిస్తున్నా. పకడ్బందీగా చట్టం తీసుకొస్తాం. నేరస్థుల కట్టడి చేసేందుకు పోలీసులను సమర్థంగా తీర్చిదిద్దుతాం" అని చంద్రబాబు అన్నారు.అంతకుముందు విద్యుత్ అంశంపై సీఎం మాట్లాడారు. విద్యుత్ వినియోదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. "1998లో తొలితరం విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. 2004 నాటికి అన్ని సబ్‌స్టేషన్లు ఆధునీకరించాం. ట్రాన్స్మిషన్ నష్టాలు తగ్గించి తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. 2014లో నేను సీఎం అయ్యాక సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాం. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ను ప్రోత్సహించాం. ఆధునిక సాంకేతికతతో గ్యాస్ ఆధారిత విద్యుత్ సబ్‌స్టేషన్ను ప్రారంభించుకోవడం గర్వకారణం. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా శంకుస్థాపన చేసిన 12 సబ్‌స్టేషన్లు, 10 ట్రాన్స్ మిషన్ లైన్ల పనులు ఏడాదిలోపు పూర్తవుతాయి. రూ.1.25 లక్షల కోట్ల అప్పు విద్యుత్ రంగంలోనే ఉండటం ఆశ్చర్యం కలిగించింది. రాష్ట్రంలో 2019 తర్వాత విద్యుత్ విధ్వంసం జరిగింది. గత ప్రభుత్వం కేంద్రం నిధులు సహా డబ్బులన్నీ దారి మళ్లించేసింది. దుర్మార్గపు ఆలోచనలతో విద్యుత్ ఒప్పందాలను జగన్ రద్దు చేశారు. పీపీఏల రద్దుపై కోర్టులు మొట్టికాయలు వేసినా మారలేదు. వాడని విద్యుత్కు రూ.9వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది. 9 సార్లు ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32,166 కోట్ల భారం మోపారు" అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చంద్రబాబు నాయకత్వంలో పంచాయతీల బలోపేతానికి కృషి: పవన్ కల్యాణ్

సర్పంచుల డిమాండ్లలో కీలకమైనవి గుర్తించి పూర్తి చేశామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.



మంగళగిరి, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్): సర్పంచుల డిమాండ్లలో కీలకమైనవి గుర్తించి పూర్తి చేశామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కేరళ నుంచి ఐఏఎస్ అధికారి కృష్ణతేజను డిప్యుటేషన్పై తీసుకొచ్చామని.. ఆయన సహకారంతోనే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పవన్ చెప్పారు. ఈ మేరకు మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో సర్పంచుల సంఘాల ప్రతినిధులతో పవన్ సమావేశమయ్యారు. "ప్రజలకు మేలు చేద్దామనే ఆలోచన ఉన్న అధికారులు నా పేషీలో ఉండటం నా అదృష్టం. ఎంపీ నిధుల ద్వారా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం. 2014-19 కాలానికి సంబంధించిన పనులకు గత ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. పెండింగ్ నిధుల విడుదలకు కేబినెట్లో చర్చించి ఆమోదం తెలిపాం. సర్పంచులకు ప్రథమ పౌరుల స్థానం ఇవ్వాలి. పంచాయతీలకు నిధులు ఎక్కువ కావాలి. స్వయం పోషక పంచాయతీలుగా ఎదగాలి. 12,900 పంచాయతీల్లో నిధులను గత ప్రభుత్వం వాడుకుంది. ఇతర అవసరాలకు రూ.8,629 కోట్లు మళ్లించేశారు. ఈ అంశాలను సీఎం, ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్తా. మరో నెలలో రూ.750 కోట్లు పంచాయతీల ఖాతాలకే రాబోతున్నాయి.ప్రధాని మోదీ కూడా గ్రామీణాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. గత ప్రభుత్వం బాధ్యత లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. సరిచేయడానికి చంద్రబాబు అనుభవం కీలకంగా మారింది. పంచాయతీలను బలోపేతం చేసేందుకు చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తున్నాం. గ్రామ వాలంటీర్లను జగన్ ప్రభుత్వం మోసం చేసి పెట్టుకుంది. ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా గ్రామ వాలంటీర్ల అంశమే లేదు. అసలు ఉద్యోగాల్లోనే లేరంటే.. రద్దు అనే అంశం ఎక్కడుంది? జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తాం. చెరువుల్లో పూడికలు తీసి, నీరు కలుషితం కాకుండా చూడాలి. పంచాయతీరాజ్ వ్యవస్థలో అవినీతిని నిర్మూలించేలా చర్యలు తీసుకుంటాం" అని పవన్ వెల్లడించారు.

# చంద్రబాబు కృషి వల్లే ఐటీ రంగంలో అద్భుత ఫలితాలు: మంత్రి లోకేశ్

ఉన్నత విద్య కోసం తాను కూడా విదేశాలకు వెళ్లి వచ్చానని మంత్రి లోకేశ్ తెలిపారు. మనకు, విదేశాల్లో ఉన్నత విద్యకు తేడాలు ఉన్నాయని చెప్పారు.



అమరావతి, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్): ఉన్నత విద్య కోసం తాను కూడా విదేశాలకు వెళ్లి వచ్చానని మంత్రి లోకేశ్ తెలిపారు. మనకు, విదేశాల్లో ఉన్నత విద్యకు తేడాలు ఉన్నాయని చెప్పారు. అమరావతిలోని విట్ వర్సిటీలో అంతర్జాతీయ ఉన్నత విద్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి నారా లోకేశ్ హాజరై మాట్లాడారు. విదేశాల్లో పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు ఉండరని చెప్పారు. అంతర్జాతీయ కంపెనీల్లో తెలుగువాళ్లు అగ్రస్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. "ఐటీ రంగం అభివృద్ధి కోసం చంద్రబాబు చేసిన కృషి వల్లే అద్భుత ఫలితాలు వచ్చాయి. దీంతో మన విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారు. విదేశాల్లో ఇప్పుడు మన తెలుగు వాళ్లు మంచి స్థానాల్లో ఉన్నారు. గెలవడం కోసం నిలబడాలన్న మాటను విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలి. అంతర్జాతీయ పరిణామాల గురించి అవగాహనతో ఉండాలి. రాబోయే 25 ఏళ్లలో ఇండియా మరింత అభివృద్ధి చెందనుంది. వికసిత్ భారత్, వికసిత్ ఏపీ నినాదంతో ముందుకెళుతున్నాం. ప్రపంచ ఆర్థికశక్తిగా భారత్ ఎదిగేందుకు అవకాశం ఉంది" అని లోకేశ్ తెలిపారు.

# అంతర్జాతీయక్రీడల నిర్వహణకుప్రభుత్వాలు ఖర్చు చేయడం సాధారణమే: కేటీఆర్


ఫార్ములా-ఈ కారు రేస్ వ్యవహారంలో ఒప్పందం కుదరడానికి ముందే నిధులు చెల్లించడం.. అందులోనూ నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కరెన్సీ రూపంలో ఇవ్వడంపై విచారణ వేగవంతమైన నేపథ్యంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు.




హైదరాబాద్, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్): ఫార్ములా-ఈ కారు రేస్ వ్యవహారంలో ఒప్పందం కుదరడానికి ముందే నిధులు చెల్లించడం.. అందులోనూ నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కరెన్సీ రూపంలో ఇవ్వడంపై విచారణ వేగవంతమైన నేపథ్యంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. విశ్వనగరాల సరసన హైదరాబాద్ను చేర్చాలనే ఉద్దేశంతోనే ఫార్ములా-ఈ కారు రేసింగ్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫార్ములా-1 రేసింగ్ను నిర్వహించేందుకు అనేక దేశాలు పోటీ పడతాయని.. అయితే, దానిని హైదరాబాద్లో నిర్వహించేందుకు నిర్వాహకులు అంగీకరించకపోవడంతో ఫార్ములా ఈ రేసింగ్కు మొగ్గు చూపామన్నారు. "ఫార్ములా-1 రేసింగ్ తొలిసారి 1946లో జరిగింది. ఈ రేస్ నిర్వహణకు అనేక దేశాలు పోటీపడతాయి. భారత్లో ఫార్ములా-1 రేసింగ్ నిర్వహించాలని 2003లోనే చంద్రబాబు ఆశించారు. కానీ, నిర్వాహకులు సుముఖత చూపించకపోవడంతో సాధ్యం కాలేదు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మళ్లీ నేను వాళ్లతో మాట్లాడాను. అయినా ప్రయోజనం లేకపోయింది. అందుకే ఎలక్ట్రిక్ వాహనాలతో నిర్వహించే ఫార్ములా-ఈ కారు రేసింగ్ నిర్వహించాం. 1984లో ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు ఢిల్లీలో జరిగాయి. వాటి కోసం రూ.70,608 కోట్లు ఖర్చు చేశారు. అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ప్రభుత్వాలు ఖర్చు చేయడం సర్వసాధారణం. కామన్వెల్త్ క్రీడల కోసం ఒరిజినల్ కాస్ట్ కంటే 100 రెట్లకుపైగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసింది. దాంతో పోల్చుకుంటే ప్రస్తుతం నిర్వహణ వ్యయం దాదాపు పది.. పదిహేను రెట్లు పెరుగుతుంది. కానీ, ఓ మంచి ఉద్దేశంతో హైదరాబాద్లో ఫార్ములా-ఈ రేస్ నిర్వహిస్తే.. దానిపై ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేస్తోంది " అని కేటీఆర్ అన్నారు.

# వాస్తు పిచ్చితో సచివాలయానికి మార్పులు: హరీశ్ రావు

సచివాలయంలో మార్పులపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు.



హైదరాబాద్, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్): సచివాలయంలో మార్పులపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. భారాస ప్రభుత్వ హయాంలో గ్రీన్ టెక్నాలజీ, ఫైర్ సేఫ్టీ నార్మ్స్ తో దీన్ని నిర్మించినట్లు చెప్పారు. వాస్తు పిచ్చితో సీఎం రేవంత్రెడ్డి మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. సచివాలయానికి పూటకో మార్పు చేస్తున్నారని చెప్పారు. వాస్తు దోషం ఉందని ఒక్క గేట్ మార్పు కోసం రూ.4 కోట్లు ఖర్చు పెడుతున్నారని పేర్కొన్నారు.

# 11నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

సంస్థాగతంగా భాజపాను బలోపేతం చేసుకోవాలని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిపిలుపునిచ్చారు.

హైదరాబాద్, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):



సంస్థాగతంగా భాజపాను బలోపేతం చేసుకోవాలని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై కార్యశాల నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపాకు సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు.మహిళ, యువత, రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయని చెప్పారు. 11 నెలల్లోనే ఈ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వివరించారు. కార్యశాలలో సునీల్ బన్సల్, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి పీవీ సింధు భూమిపూజ

బ్యాడ్మింటన్పై ఆసక్తి ఉన్న చిన్నారులు, యువతను ఉన్నత స్థాయి పోటీల్లో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు.



**విశాఖపట్నం, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** బ్యాడ్మింటన్పై ఆసక్తి ఉన్న చిన్నారులు, యువతను ఉన్నత స్థాయి పోటీల్లో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. విశాఖపట్నంలోని పెద గదిలి కూడలి సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి ఆమె తన తల్లిదండ్రులతో కలిసి భూమిపూజ చేశారు. పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అకాడమీ సామర్థ్యం, శిక్షణ తదితర వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. ఇక్కడ సుమారు మూడెకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు కేటాయించింది.

# బెంగళూరుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్.. చెరువుల పునరుద్ధరణపై అధ్యయనం

హైడ్రా కమిషనర్ రంగనాథ్ బెంగళూరుకు చేరుకున్నారు. నేటి నుంచి రెండు రోజుల పాటు చెరువుల పునరుద్ధరణపై అధ్యయనం చేయనున్నారు.



**హైదరాబాద్, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** హైడ్రా కమిషనర్ రంగనాథ్ బెంగళూరు చేరుకున్నారు. నేటి నుంచి రెండు రోజుల పాటు ఆ నగరంలో చెరువుల పునరుద్ధరణపై అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు బుధవారమే బెంగళూరు వెళ్లగా.. రంగనాథ్ గురువారం అక్కడికి చేరుకున్నారు. చెరువుల పనరుద్ధరణతో పాటు విపత్తు నిర్వహణపై వారు అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు తమ పర్యటనలో యలహంకలోని కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్ను సందర్శించనున్నారు. అక్కడి సీనియర్ శాస్త్రవేత్తలతో విపత్తు నిర్వహణపై సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి సెన్సార్ల సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తారు. బెంగళూరు కోర్ సిటీలో ఉన్న చెరువులను సందర్శిస్తారు. రెండో రోజు పర్యటనలో లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్తో రంగనాథ్ సమావేశం కానున్నారు. కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్మెంట్ అథారిటీ చట్టం 2014పై చర్చించనున్నారు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోన్హళ్లీ చెరవు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతికతను తెలుసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ఐదు చెరువులను పునరుద్ధరించాలని ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా ఆ దిశగా చర్యలను వేగవంతం చేసింది.

# కుమారుడు తీసుకున్న డబ్బు తిరిగివ్వలేదని తల్లి కిడ్నాప్!

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం కొడుముంజలో అమానవీయ ఘటన జరిగింది.



**వేములవాడ, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం కొడుముంజలో అమానవీయ ఘటన జరిగింది. కుమారుడు తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేదని గుత్తేదారు అనుచరులు అతడి తల్లిని కిడ్నాప్ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కొడుముంజకు చెందిన పల్లపు శ్రీనివాస్ చెరకు కోత కూలీలకు మేస్త్రీగా పనిచేస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన లాల్ దేవకర్ వద్ద చెరకు కోతకు శ్రీనివాస్ రూ.3లక్షలు తీసుకున్నారు. కూలీలు రాకపోవడంతో ఇటీవల లాల్ దేవకర్, శ్రీనివాస్ మధ్య పలుమార్లు వాగ్వాదం జరిగింది. దేవకర్ అనుచరులు బుధవారం కొడుముంజ గ్రామానికి వచ్చి శ్రీనివాస్ భార్య, అతడి కుటుంబసభ్యులపై దాడి చేశారు. అనంతరం తల్లి పల్లపు బీమాబాయిని కారులో తీసుకెళ్లారు. దీనిపై శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పోలవరం కాఫర్ డ్యాం సీపేజీ తగ్గింపు ఎలా? తాజా పరీక్షల ఫలితాల నేపథ్యంలో మళ్లి చర్చ

పోలవరం ప్రాజెక్టుపై నాలుగు రోజుల మేధోమథనంలో భాగంగా తొలిరోజు బుధవారం ఎగువ కాఫర్ డ్యాం సీపేజీని తగ్గించి, నిర్మాణ పనులు చేసుకొనేందుకు ఏమేం చర్యలు చేపట్టాలన్న దానిపై నిపుణులు ప్రధానంగా చర్చించారు.



పోలవరం క్యాంపు కార్యాలయంలో చర్చిస్తున్న నిపుణులు

**అమరావతి, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** పోలవరం ప్రాజెక్టుపై నాలుగు రోజుల మేధోమథనంలో భాగంగా తొలిరోజు బుధవారం ఎగువ కాఫర్ డ్యాం సీపేజీని తగ్గించి, నిర్మాణ పనులు చేసుకొనేందుకు ఏమేం చర్యలు చేపట్టాలన్న దానిపై నిపుణులు ప్రధానంగా చర్చించారు. పోలవరం క్యాంపు కార్యాలయంలో కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీరు విజయ్ శరణ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. తొలుత ఈ బృందం ప్రాజెక్టులో కొంత ప్రాంతాన్ని సందర్శించింది. మధ్యాహ్నం నుంచి చర్చలు ప్రారంభమయ్యాయి.

## ఏస్థాయి ప్రవాహాల వద్ద ఎంత సీపేజీ?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేస్తున్న మేఘా కంపెనీ తరఫున పనిచేస్తోన్న ఆఫ్రి డిజైన్సంస్థ ఎగువ కాఫర్ డ్యాం సీపేజీపై తమ పరీక్షల వివరాలను, సమస్య పరిష్కారానికి పలుప్రతిపాదనలను సమావేశం ముందుంచింది. గోదావరిలో ఏస్థాయి నీటి ప్రవాహాల వద్ద ఎంత సీపేజీఉంటుందన్న దానిపై ప్రజంటేషన్ ఇచ్చింది. ఎగువ కాఫర్ డ్యాం కోసం దిగువన జెట్ గ్రౌటింగుపనుల్లో కొంత సమస్య ఉందని గుర్తించారు. దీనికి కాఫర్ డ్యాంలో కొంత గ్రౌటింగు చేసే అంశాన్నినిపుణుల బృందం చర్చించింది. ప్రస్తుతం ప్రధాన డ్యాం వద్ద 40 పంపుల ద్వారా నీటినిఎత్తిపోస్తున్నారు. ప్రస్తుతం 80 క్యూసెక్కుల సీపేజీ మాత్రమే ఉన్న నేపథ్యంలో పనులకుఅంతరాయం ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. 10 లక్షల క్యూసెక్కుల లోపు ప్రవాహాలు ఉంటే సీపేజీ అంతగా ఉండటం లేదన్న అంశమూ చర్చకు వచ్చింది. సాయంత్రం విదేశీ నిపుణులు, కేంద్ర జలసంఘం అధికారులు ప్రత్యేకంగా చర్చించుకున్నారు. సీపేజీపై ఆఫ్రి సంస్థ చేపట్టిన 3డీ నమూనా అధ్యయన వివరాలను గురువారం సమర్పించనున్నారు.

## నేడు డయాఫ్రం వాల్నిర్మాణంపైచర్చ



పోలవరంలో సీపేజీ నివారణపై మిగిలిఉన్న కొద్దిపాటి చర్చ గురువారం ముగించి, కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణంపై దృష్టి పెట్టనున్నారు. నిర్మాణ షెడ్యూలుతో పాటు డిజైన్లు ఇతర అంశాలూ చర్చకు రానున్నాయి. శుక్రవారం చర్చ మొత్తం ప్రధాన డ్యాం నిర్మాణంపై ఉండనుంది. ఫలితాలపై విదేశీ నిపుణులు, కేంద్ర జలసంఘం అధికారులు, కేంద్ర జలసంఘం చైర్మన్ విడివిడిగా.. అంతర్గతంగా చర్చించుకుంటారు. ఆ తర్వాతే అన్ని అంశాలపై తుది నిర్ణయాలు వెలువరిస్తారు. ఈ చర్చల్లో కేంద్ర జలసంఘం డైరెక్టర్ రాకేష్, డిప్యూటీ డైరెక్టర్లు అశ్వనీ కుమార్ వర్మ, గౌరవ్ తివారీ, కేంద్ర ఇసుక మట్టి పరిశోధన సంస్థ డైరెక్టర్ చిత్ర, శాస్త్రవేత్త మనీష్ గుప్తా, పోలవరం అథారిటీ చీఫ్ ఇంజినీరు రాజేష్కుమార్, ఆకృతుల సంస్థ చీఫ్ ఇంజినీరు రత్నకుమార్, ఎన్.పుల్లారావు, వ్యాప్కోస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ త్రిపాఠీ, ఆఫ్రి ఎండీ సాయి శీలాకృష్ణ, బావర్ డైరెక్టర్ హసన్, మేఘా సీనియర్ మేనేజర్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# మహిళను అవమానిస్తారా? మీరు లాగేసినా ప్రజలు నాకు కుర్చీ ఇచ్చారు: తెదేపా ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో రసాభాస జరిగింది. మేయర్ ఛాంబర్ లో ఇద్దరు తెదేపా ఎమ్మెల్యేలకు కుర్చీలు తీసేశారు.



**కడప, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో రసాభాస జరిగింది. మేయర్ ఛాంబర్లో ఇద్దరు తెదేపా ఎమ్మెల్యేలకు కుర్చీలు తీసేశారు. దీంతో తెదేపా ఎమ్మెల్యే మాధవీరెడ్డి నిల్చొని నిరసన తెలిపారు. మరోవైపు ఆమె మాట్లాడుతుండగా మేయర్ సురేశ్, కార్పొరేటర్లు అడ్డుకున్నారు. ఎక్స్ అఫీషియో మెంబర్ మాట్లాడే అవకాశం ఉందని మాధవి పట్టుబట్టారు. ఈ క్రమంలో గందరగోళం నెలకొంది. మాధవీరెడ్డి మాట్లాడుతూ పాలకవర్గం తీరుపై మండిపడ్డారు. “మహిళను అవమానిస్తారా? మీరు లాగేసినా ప్రజలు నాకు కుర్చీ ఇచ్చారు. కుర్చీల కోసం పోరాడాల్సిన అవసరం నాకు లేదు. సమావేశమంతా నిల్చొని మాట్లాడే శక్తి నాకుంది. అహంకారం, అధికారం ఎక్కువైతే ఎలా ప్రవర్తిస్తారో చూస్తున్నాం” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నగరపాలక సంస్థ వద్ద పోలీసులు మూడంచెల బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ముంబయి నటి కేసు.. హైకోర్టులో విచారణ వాయిదా

ముంబయి నటి కేసులో ఐపీఎస్ అధికారుల ముందస్తు బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది.



**అమరావతి, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** ముంబయి నటి కేసులో ఐపీఎస్ అధికారులు ముందస్తు బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ముందస్తు బెయిల్ కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్ని, ఏసీపీ హనుమంతరావు, సీఐ సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇదే కేసులో సినీనటి ఇంప్లీడ్ అయ్యారు. వాదనలు విన్న న్యాయస్థానం.. తదుపరి విచారణను నవంబర్ 26కు వాయిదా వేసింది. అప్పటివరకు గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# ప్రేమ పేరిట యువతికి వేధింపులు.. తండ్రి బలవన్మరణం

తన కుమార్తె(16)ను ఓ యువకుడు ప్రేమ పేరిట ఏడాదిగా వేధిస్తుండటంతో మనోవేదనకు గురైన తండ్రి రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. గద్వాల రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది.

**గద్వాల , నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** తన కుమార్తె(16)ను ఓ యువకుడు ప్రేమ పేరిట ఏడాదిగా వేధిస్తుండటంతో మనోవేదనకు గురైన తండ్రి రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. గద్వాల రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ కథనం ప్రకారం.. గద్వాలకి చెందిన వ్యక్తి(34) హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన కుమార్తె ఓ పాఠశాలలో చదువుతుండగా పట్టణానికి చెందిన వినోద్ ప్రేమ పేరిట తరచూ వేధిస్తుండటంతో ఆమెను చదువు మాన్పించారు. ప్రవర్తన మార్చుకోవాలని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి పలుమార్లు ఆయన వినోద్ను హెచ్చరించారు. అయినా మారకపోగా యువతికి వేధింపులు ఎక్కువ కావడంతో కలత చెంది గద్వాల మండలం వెంకంపేట శివారులో రైలు కింద పడి బలవన్మరణం చెందాడు. కేసు నమోదు చేశామని, నిందితుడు పరారీలో ఉన్నాడని అశోక్ చెప్పారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నాం: పేర్ని నాని

ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు మాజీ మంత్రి పేర్ని నాని వెల్లడించించారు..



**విజయవాడ, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు మాజీ మంత్రి పేర్ని నాని వెల్లడించించారు. ఎన్నికలు ధర్మబద్ధంగా జరిగే అవకాశం కనిపించట్లేదని, ఓటర్లు ప్రశాంతంగా బయటకొచ్చి ఓట్లేసే పరిస్థితి లేదని ఆయన అన్నారు.

# న్యూజిలాండ్ ప్రధానితో తెదేపా ఎమ్మెల్యేల భేటీ

న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్తో పర్చూరు, బాపట్ల తెదేపా ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్ర వర్మ భేటీ అయ్యారు.



**విల్లింగ్టన్, నవంబర్, 07 (రిపబ్లిక్ న్యూస్):** న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్తో పర్చూరు, బాపట్ల తెదేపా ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్ర వర్మ భేటీ అయ్యారు. మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్, న్యూజిలాండ్ ఎన్నారై తెదేపా ఆహ్వానం మేరకు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యేలు ఆ దేశ ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధానితో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఏపీ సీఎం చంద్రబాబు చేపట్టిన వివిధ కార్యక్రమాలను ప్రధానికి వివరించారు. చంద్రబాబు తనకు తెలుసని, మంచి విజనరీ నాయకుడని క్రిస్టోఫర్ కితాబిచ్చారు. చంద్రబాబు సారథ్యంలో నెలకొల్పిన కియా కార్లు ఆంధ్రప్రదేశ్ నుంచి న్యూజిలాండ్కు వస్తున్నాయని ఎమ్మెల్యేలు ఆయనకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనకు రావాలని న్యూజిలాండ్ ప్రధానిని ఎమ్మెల్యేలు ఆహ్వానించారు. ఏపీలో భారీ పరిశ్రమలను నెలకొల్పాలని కోరారు. ఈ మేరకు మార్చిలో అమరావతి పర్యటనకు వస్తానని ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ చెప్పారు. ఎమ్మెల్యేలతో పాటు న్యూజిలాండ్ నేషనల్ పార్టీ ప్రతినిధులు శివ కిలారి, బాల వేణుగోపాల్ వీరం, తెదేపా న్యూజిలాండ్ కో-ఆర్డినేటర్ జితేందర్ నిమ్మగడ్డ, మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ నేతలు మద్దుకూరి దిలీప్, అశోక్ గోరంట్ల, న్యూజిలాండ్ ఎన్నారై తెదేపా అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం



అబ్రహాం లింకన్


## చరిత్రలో నేటి ప్రత్యేకత


చంద్ర పాల్



మేరీ క్యూరీ


వెంకటరామన్


కమల్ హాసన్


రియో ఫెర్డినాండ్


కార్తీక్



అనుష్క శెట్టి


హిందూ దేవాలయాల


- 1858: లాల్, బాల్, పాల్ త్రయంలో ఒకడైన బిపిన్ చంద్ర పాల్ జననం (మ.1932).
- 1867: భౌతిక, రసాయనిక శాస్త్రవేత్త మేరీ క్యూరీ జననం (మ.1934).
- 1888: శాస్త్రవేత్త, చంద్రశేఖర్ వెంకటరామన్ జననం (మ.1970).
- 1954: భారతీయ సినిమా నటుడు కమల్ హా-సన్ జననం.
- 1978: ఇంగ్లీష్ ఫుట్‌బాల్ ఆటగాడు రియో ఫెర్డినాండ్ జననం.
- 1980: భారతీయ చిత్ర నేపథ్యగాయకుడు కార్తీక్ జననం.
- 1981: భారతీయ సినీ నటి అనుష్క శెట్టి జననం. (చిత్రంలో)
- 2000: భారతీయుడు, భారతరత్న పురస్కార గ్రహీత సి.సుబ్రమణ్యం మరణం (జ.1910).

2005: సువిశాల భూభాగంలో నిర్మితమైన హిందూ దేవాలయాల సముదాయం అక్షరధామ్ ప్రారంభం.

# కమల్ హాసన్ బర్త్ డే స్పెషల్ వచ్చేసింది..

## 'థగ్ లైఫ్' స్పెషల్ టీజర్ చూశారా

కమల్ హాసన్ పుట్టినరోజు సందర్భంగా 'థగ్ లైఫ్' టీమ్ అప్డేట్ ఇచ్చింది. విడుదల తేదీ ప్రకటిస్తూ టీజర్ విడుదల చేసింది. కమల్ హాసన్ పుట్టినరోజు సందర్భంగా 'థగ్ లైఫ్' టీమ్ అప్ డేట్ ఇచ్చింది. విడుదల తేదీ ప్రకటిస్తూ టీజర్ విడుదల చేసింది.




కమల్ హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తోన్న చిత్రం 'థగ్ లైఫ్'. పాన్ ఇండియా స్థాయిలో భారీ తారాగణంతో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా అప్డేట్స్ కోసం ఎన్నో రోజుల నుంచి అభిమానులు ఎదురుచూస్తున్నారు. నేడు ఈ మల్టీ టాలెంటెడ్ హీరో బర్త్డే సందర్భంగా టీమ్ అప్డేట్ ఇచ్చింది. రిలీజ్ డేట్ ప్రకటిస్తూ టీజర్ విడుదల చేసింది. వచ్చే ఏడాది జూన్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నట్లు తెలిపింది. సముద్రపు దొంగల నేపథ్యంలో యాక్షన్ డ్రామాగా 'థగ్ లైఫ్' సిద్ధమవుతోంది. 'నాయకన్' లాంటి హిట్ తర్వాత కమల్హాసన్ - మణిరత్నం కాంబోలో 36 సంవత్సరాల తర్వాత - వస్తోన్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో దీనిపై అంచనాలు ఏర్పడ్డాయి. రాజ్కమల్ ఇంటర్నేషనల్ ఫిలింస్, మద్రాస్ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. త్రిష కథానాయిక. మలయాళ నటుడు జోజు జార్జ్ పాటు హీరో గౌతమ్ కార్తీక్, ఐశ్వర్య లక్ష్మీ ఇందులో కీలక పాత్రలు పోషించనున్నారు. ఎ.ఆర్. రెహమాన్ స్వరాలు అందిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# నటుడు షారుక్ ఖాన్కు బెదిరింపులు..!

## బాలీవుడ్ ప్రముఖ నటుడు షారుక్ ఖాన్కు బెదిరింపులు వచ్చాయి.



బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్కు ఇటీవల లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో వరుస బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరో అగ్ర నటుడు షారుక్ ఖాన్కు ఈ తరహా బెదిరింపులు వచ్చాయి. రూ.50లక్షలు ఇవ్వకపోతే హాని తలపెడతామంటూ ముంబయి పోలీసులకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ఫోన్ కాల్ను ఆరా తీయగా.. ఛత్తీస్గఢ్ ని రాయ్పుర్కు చెందిన ఫైజన్ ఖాన్ అనే వ్యక్తి పేరు మీద నంబరు రిజిస్టర్ అయినట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులకు సమాచారమివ్వగా వారు ఫైజన్ ఖాన్ను ప్రశ్నించారు. అయితే, తన ఫోన్ నవంబరు 2వ తేదీనే చోరీకి గురైందని, దానిపై తాను ఫిర్యాదు కూడా చేశానని పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఆ ఫోన్ ఎక్కడి నుంచి వచ్చిందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. షారుక్కు గతేడాది అక్టోబరులోనూ ఇదే విధంగా హత్య బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు అతడి భద్రతను పెంచారు. కృష్ణజింకలను వేటాడిన కేసు నేపథ్యంలో ఇప్పటికే పలుమార్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి సల్మాన్ ఖాన్ కు బెదిరింపులు ఎదురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా షారుక్ ఖాన్కు డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరింపులు రావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# సఫారీలతో నాలుగు టీ20లు.. ఫోకస్ అంతా సంజు శాంసన్పైనే: అనిల్ కుంబ్లే

## దక్షిణాఫ్రికాతో జరిగే నాలుగు టీ20ల సిరీస్లో ఫోకస్ అంతా సంజు శాంసన్పైనే ఉంటుందని భారత మాజీ ఆటగాడు. అనిల్ కుంబ్లే పేర్కొన్నాడు.

నాలుగు టీ20 మ్యాచ్ల సిరీస్ కోసం టీమ్ ఇండియా దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లింది. నవంబర్ 8న దర్బన్ వేదికగా తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ సిరీస్లో ఫోకస్ అంతా సంజు శాంసన్ పైనే ఉంటుందని భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే పేర్కొన్నాడు. సంజు నిలకడగా రాణించకపోవడమే అందుకు కారణమని కుంబ్లే తెలిపాడు. దాదాపు పదేళ్ల క్రితం భారత జట్టులోకి వచ్చిన




శాంసన్ ఇప్పటికీ తన స్థానాన్ని పదిలం చేసుకోలేదు. నిలకడ లేమి, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో సంజు విఫలమయ్యాడు. దీంతో అతడిని కొన్నిసార్లు తుది జట్టు నుంచి తప్పించడం లేదా జట్టులోకి తీసుకోకపోవడం చేశారు. అయితే, ఇటీవల బంగ్లాదేశ్తో జరిగిన టీ20లో మాత్రం శాంసన్ సెంచరీ బాదాడు. ఇప్పుడు అతను సఫారీలతో టీ20 సిరీసు ప్రధాన వికెట్కీపర్గా ఎంపికయ్యాడు. "సంజు శాంసన్ను జట్టులో పర్మినెంట్గా ఉంచడం గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. బంగ్లాదేశ్పై చేసిన సెంచరీ అతనికి చాలా ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. శాంసన్ సామర్థ్యం మనకు తెలుసు. అతను క్లాస్ ప్లేయర్. ఆటలో స్థిరత్వం కొంచెం లోపించింది. భారత సెలక్టర్లు దానిని దృష్టిలో ఉంచుకుంటారని కచ్చితంగా అనుకుంటున్నాను. శాంసన్ను ఓపెనర్గా లేక తర్వాతి మూడు స్థానాల్లో ఎక్కడ ఆడించినా రాణిస్తాడని నమ్ముతున్నాను. క్రీజులో లోపలికి జరిగి బ్యాక్ఫుట్పై బలంగా నిలబడి షాట్లు కొట్టగలడు. ఫాస్ట్ బౌలర్ల బౌలింగ్లో కాస్త సమయం తీసుకునే ఆడతాడు. స్పిన్నర్లపై మాత్రం బలమైన షాట్లతో విరుచుకుపడతాడు. దక్షిణాఫ్రికాలోని పరిస్థితుల్లో అతను నాలుగు మ్యాచ్లో ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారింది" అని అనిల్ కుంబ్లే వివరించాడు.

## ఆరోగ్యం

సీజన్ మారే కొద్దీ మనకి కొన్ని సమస్యలొస్తాయి. అందుకే మన డైట్‌లో కొన్ని చేంజెస్ చేయాలి. కొన్ని ఫుడ్స్‌ని యాడ్ చేసుకోవాలి. ఈ నేపథ్యంలో వింటర్ డైట్‌లో మనం తేనెని యాడ్ చేస్తే కలిగే లాభాలు అన్నీ ఇన్నీ కావు. జలుబు, దగ్గు, తలనొప్పి నుంచి చర్మ సమస్యల వరకూ చాలా హెల్త్‌ప్రాబ్లమ్స్‌కి తేనె తీసుకోవడం వల్ల చెక్ పెట్టొచ్చు. అవేంటో తెలుసుకోండి.




# చలికాలంలో తేనెని ఇలా తీసుకుంటే కొలెస్ట్రాల్ తగ్గి ఈ సమస్యలన్నీ దూరం






### జీర్ణ సమస్యలు..




సాధారణంగా కొంతమంది జీర్ణ సమస్యలతో బాధపడతారు. అలాంటి వారు తేనెని రెగ్యులర్‌గా తీసుకుంటే కడుపులోని సమస్యని దూరం చేసి అజీర్ణం దూరమవుతుంది. అంతేకాకుండా, గోర-ువెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే శ్వాస సమస్యలు దూరవ-ువుతాయి. ఇందులో కొద్దిగా లవంగాల పొడి కలిపితే మరీ మంచిది. ఇక దాల్చిన చెక్క పొడితో తేనెని కలిపి తీసుకుంటే బాడీలో కొలెస్ట్రాల్ కరుగుతుంది. ఒత్తిడి కూడా తగ్గుతుంది.

### ఇమ్యూనిటీ పెరగడం..



తేనెలో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూన్ సిస్టమ్ హెల్దీగా మారుతుంది. దీంతో చలికాలంలో వచ్చే దగ్గు, జలుబు, మైగ్రేన్ వంటి సమస్యలు చాలా వరకూ తగ్గుతాయి. దీంతో పాటు గొంతునొప్పికి నేచురల్ ట్రీట్‌మెంట్ అని చెప్పొచ్చు తేనెని. తేనె తీసుకోవడం వల్ల దగ్గుకి మందులా పని చేస్తుంది.

### నిద్ర సమస్యలు..



కొంతమంది నిద్ర సమస్యలతో బాధపడుతుంటారు. సరిగా నిద్ర పట్టదు. అలాంటివారు గోరువెచ్చని పాలలో తేనెని కలిపి తీసుకుంటే రిలాక్సేషన్ పెరిగి హ్యాపీగా నిద్రపడుతుంది.

### అందానికి కూడా..



తేనెని వాడడం వల్ల అందాన్ని కూడా పెంచుకోవచ్చు. చలికాలంలో చాలా మందికి పెదవులు పగులుతుంటాయి. తేనెని రాయడం వల్ల ఆ సమస్య తగ్గుతుంది. డ్రై స్కిన్‌కి కూడా ఈ తేనె చెక్ పెడుతుంది. కొద్దిగా పాలలో తేనెని కలిపి మాయిశ్చరైజర్‌లా వాడుకోవచ్చు. తేనెలోని గుణాలు డ్రై స్కిన్‌ని దూరం చేసి స్కిన్ తేమగా మారేలా చేస్తుంది. దీనిని తీసుకుంటే ఎక్స్‌ఫోలియేట్ అవుతుంది. బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ సమస్యలు తగ్గుతాయి.గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.